క్లుప్తంగా

ఒప్పంద అధ్యాపకుల సర్వీస్ రెన్యువల్

పీలేరురూరల్ : జిల్లాలో 46 మంది ఒప్పంద డిగ్రీ అధ్యాపకుల సర్వీస్ రెన్యువల్ చేసినట్లు జిల్లా ఐడీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో కలెక్టర్ గిరీషా ఆధ్వర్యంలో అధ్యాపకులు సర్వీస్ రెన్యువల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి అధ్యాపకుల పనితీరు, ఫలితాలు పరిగణలోకి తీసుకుని సర్వీస్ రెన్యువల్ చేసినట్లు చెప్పారు.

శబ్దాలు చేసే సైలెన్సర్లు ధ్వంసం

గుర్రంకొండ : రోడ్లపై పెద్ద పెద్ద శబ్దాలు చేసే ద్విచక్రవాహనాల సైలెన్సర్లను పోలీసులు ధ్వంసం చేయించారు. గురువారం ఎన్‌హెచ్ 340 మార్గంలో ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై శబ్దాలు చేస్తూ వెళుతున్న ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు.

మైనార్టీల అభ్యున్నతే ధ్యేయం

గుర్రంకొండ : మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం మంగళగిరిలో ఆశాఖ కార్యాలయంలో జెడ్పీటీసీ సమీన్ ముక్తియార్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీని ఇక్బాల్ అహ్మద్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనార్టీల అభ్యున్నతి జగనన్న ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఇనాయతుల్లా, లాలా, కమాల్ పాల్గొన్నారు.

నేడు పీలేరు - చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం

పీలేరురూరల్ : పీలేరు డిపో నుంచి పీలేరు–చెన్నై బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించనున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మట్లాడుతూ పీలేరులో 6 గంటలకు బయలుదేరి తిరుపతి మీదుగా చెన్నైకి 11 గంటలకు చేరుకుంటుందన్నారు. చెన్నైలో 12.45కు బయలుదేరి తిరుపతి మీదుగా తిరుమలకు సాయంత్రం 5.15కు చేరుకుంటుందన్నారు. తిరుమల నుంచి తిరిగి రాత్రి 8 గంటలకు పీలేరు చేరుకుంటుందని తెలిపారు.

రేపు మాజీ సీఎం కిరణ్ రాక

కలికిరి : ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి శనివారం కలికిరికి విచ్చేయనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.క్రిష్ణప్ప తెలిపారు. 26న సాయంత్రం 4 గంటలకు కలికిరి ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకుంటారన్నారు.27, 28, 29, 30 తేదీలలో నాలుగు రోజుల పాటు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. తిరిగి 30న సాయంత్రం బయల్దేరుతారని వివరించారు.

ఆదాయమార్గాలు పెంచుకోవాలి

తంబళ్లపల్లె: క్రాంతిపథం మహిళా సభ్యులు స్థానిక వనరులను వినియోగించుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవాలని డీపీ యం లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.గురువారం స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య, వీవో సభ్యులకు మూడు రోజులుగా విజన్‌బిల్డింగ్ అంశంపై శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. విద్య, వైద్యం, ఆర్థికం, వ్యాపారం, వృత్తి మార్గాల వంటి అంశాలపై శిక్షణ ఇచ్చి గ్రూపు సభ్యులు చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. స్త్రీనిధి మేనేజర్ అమరావతి, ఏపీ యం గంగాధర్, సీసీలు భవానిశంకర్, బద్రీ, ఆదిలక్ష్మీ,తులసీ, ఎంఎస్ అధ్యక్షురాలు కుమా రమ్మ పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ: స్థానిక ఆరోగ్యవరంలో జరుగుతున్న సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంటు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. గురువారం వైజాగ్–ఫలక్‌నామా పోటీపడగా 5–0 స్కోరుతో వైజాగ్ జట్టు గెలుపొందింది. కాకినాడ–కేరళ మధ్య జరిగిన పోటీలో కేరళ , వైజాగ్–నాయుడుపేట మధ్య జరిగిన పోటీలో వైజాగ్, చెన్నై–ఎఎంసి మధ్య పోటీల్లో చెన్నై జట్టు విజయం సాధించింది.

ఉచిత కంటి పరీక్షలు

రామసముద్రం: రామసముద్రం మండలం మినికి గ్రామంలో గురువారం మదనపల్లె లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 55 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. హాజరైన వారికి కంటి వైద్య నిపుణులు అనిల్ చికిత్సలు నిర్వహించారు. సర్పంచ్ జమున, నాయకులు సుబ్బారెడ్డి, ద్వారకనాథరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. మదనపల్లె మండలం వడ్డిపల్లెకు చెందిన ఆనంద భార్య భూదేవి(45) ద్విచక్రవాహనంలో వస్తూ కాండ్లమడుగు వద్ద అదుపుతప్పి కిందపడి గాయపడింది. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

- కురబలకోటకు చెందిన బి.ఇమాంబాషా(48) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, ఆర్.కే.టైల్స్ సమీపంలో వెనుకవైపు నుంచి వచ్చిన స్కార్పియో ఢీకొంది. ప్రమాదంలో ఇమాంబాషా గాయపడగా, స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్కార్పియో ప్రమాదస్థలి నుంచి వెళ్లిపోయింది.

చంద్రయాన్-3 విజయంపై సంబరాలు


బి.కొత్తకోటలో విద్యార్థుల ర్యాలీ


కేవీపల్లె : చంద్రయాన్ 3 విజయవంతంపై గ్యారంపల్లె గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

మదనపల్లె సిటీ : చంద్రయాన్–3 విజయంపై గురువారం మదనపల్లెలో పలు పాఠశాల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లీషు మీడియం పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని మున్సిపల్ చైర్మన్ వి.మనూజరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు జాతీయ జెండాను ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సొసైటీకాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి, పోస్టాఫీసు సర్కిల్‌లో అనిబిసెంట్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ములకలచెరువు : మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలతో మానవహారం నిర్వహించారు.

వాల్మీకిపురం: భారత్ ఖ్యాతి విశ్వవ్యాప్తమైందని విశ్రాంత హిందీ పండిట్ కరీం సాహెబ్ అన్నారు. చంద్రయాన్–3 విజయవంతం సందర్భంగా శ్రీ చౌడేశ్వరీదేవి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మాజీ సైనికుడు లక్ష్మినారాయణ, నిర్వాహకులు మంజుల పాల్గొన్నారు.

పీలేరురూరల్ : చంద్రయాన్ 3 విజయవంతంతో ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలవడం అభినందనీయమని వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాల కరస్పాండెంట్ వి. మాధవి అన్నారు. గురువారం పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.


మదనపల్లె : విజయోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి


వాల్మీకిపురం : వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న విశ్రాంత హిందీ పండిట్ కరీం సాహెబ్


గుర్రంకొండ మండలం తరిగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


కలికిరిలో చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


ములకలచెరువు : జాతీయ జెండాలతో విద్యార్థులు

కలికిరి : ఇందిరమ్మకాలని జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముస్లిం జేఏసీ వ్యవస్థాపకుడు ఎంఐ హనీఫ్, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు విద్యార్థులకు సంఘీభావంగా ర్యాలీలో పాల్గొన్నారు. హెచ్ఎం సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: చంద్రయాన్–3 విజయంతో స్థానిక జెడ్పీబాలుర హైస్కూల్ విద్యార్థులు జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు.

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులు చంద్రయాన్ 3 ఆకారంలో కూర్చుని ప్రదర్శనిచ్చారు. ప్రిన్సిపాల్ జె. సురేష్ పాల్గొన్నారు.

గుర్రంకొండ : గుర్రంకొండలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు ఫుడ్ బ్యాంక్ పలువురికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తరిగొండలో జెడ్పీహైస్కూల్ విద్యార్థులు జాతీయజెండాలు చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే మానవాహారం ఏర్పాటు చేశారు. తరిగొండ అల్లుడు ఇస్రో శాస్త్రవేత్త వెంకటమహేష్‌కు జేజేలు పలికారు. ఈసందర్భంగా విద్యార్థులకు మార్కెట్‌కమిటి డైరెక్టర్ సురేష్ చాక్లెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె: అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఎంవీపల్లె పంచాయతీలో గుండ్రేవారిపల్లె, చెరువుముందరపల్లె, శ్రీనాథపురం కాలనీ, ఊర హరిజనవాడ, జాండ్రపేట, చీనేపల్లె, బసిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా నాలుగేళ్ల కాలంలో లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. శ్రీనాథపురం కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. అలాగే విద్యుత్ మీటర్ల సమస్యలు, హౌసింగ్ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీలేరు–సుండుపల్లె రోడ్డు నుంచి ఊర హరిజనవాడకు రూ. 1.25 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు ఎమ్మెల్యే భూమి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయ వర్గాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు.


ఊర హరిజనవాడకు రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మృతుని కుటుంబానికి పరామర్శ...

గర్నిమిట్ట పంచాయతీ బలిజపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ రెండు రోజుల క్రితం పీలేరులో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బలిజపల్లెకు చేరుకుని నారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యూత్ కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరయ్య, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సుగుణమ్మ, నాయకులు మల్లికార్జున రెడ్డి, వినేష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు మహల్‌లో ఉరుసు

కలికిరి : మండలంలోని మహల్‌లో హజరత్ సయ్యద్ షా మహమూద్ బాషా బుఖారి సాహెబ్ వారి ఆరవ ఉరుసు మహోత్సవం శుక్రవారం జరుగుతుందని ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్‌సహా జమాలుల్లా సాహెబ్, డాక్టర్ సయ్యద్ మహమ్మద్ రియాజ్ బుఖారి సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరుసు ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం నుంచి ఖురాన్ ఖ్వాని, సాయంత్రం భక్తిగీతాలాపన, గురువారి మజారుపై పూలచాదర్ సమర్పణ, గంధోత్సవం, రాత్రి ధార్మిక ఉపన్యాసాలు ఉంటాయన్నారు. పెనుగొండ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా రుక్నుద్దీన్ అహ్మద్ హుస్సేనీ(తాజ్ బాబా) సాహెబ్ సారథ్యంలో ప్రార్థనలు జరుగనున్నట్లు తెలిపారు. ప్రముఖ మత గురువులు పాల్గొననున్నారు.

జగనన్న పాల వెల్లువ రుణమేళా

రామసముద్రం: రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో జగనన్న పాల వెల్లువ రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగప్రసాద్, శేఖర్ మాట్లాడుతూ అమూల్ డైయిరీలో పాలు వేసిన ప్రతి రైతుకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఏపిఎం శేఖర్ మాట్లాడుతూ అమూల్ డైయిరీ పాల ఉత్పత్తి కేంద్రంలో పాలు పోసిన ప్రతి రైతుకు డిసిసి బ్యాంకు ఒకొక్క రైతుకు రూ.75 వేలు రుణం ఇస్తారని తెలిపారు.కార్యదర్శి సర్దార్‌బాషా, రెడ్డెప్ప, అమర, రైతులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మార్కెట్లు


కిటకిటలాడుతున్న బెంగుళూరు బస్టాండు

మదనపల్లె సిటీ : వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని గురువారం మదనపల్లెలో మార్కెట్లు కిటకిటలాడాయి. స్థానిక చిత్తూరు, బెంగుళూరు బస్టాండులోని పూల మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. టౌన్ బ్యాంకు సర్కిల్, నిమ్మనపల్లె క్రాస్, నీరుగట్టువారిపల్లె, అంబేడ్కర్ సర్కిల్, గొల్లపల్లి సర్కిల్ ప్రాంతాల్లో మామిడి ఆకులు, అరటి పిలకలు, పూలు,పండ్లు అమ్మకాలు జోరందుకున్నాయి. పూల ధరలు ఆకాశాన్నంటాయి. మల్లెపూలు కిలో రూ.800, బటన్ రోజాలు కిలో రూ.200, చామంతులు కిలో రూ.120 ధరలు పలికాయి. పూలహారాలు ధరలు రెట్టింపయ్యాయి. దీంతో పాటు పండ్లు, అరటి పిలకలు ఒక్కోటి రూ.100 పలికింది.

పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ

రామసముద్రం: రామసముద్రం మండలం మాలేనత్తం గ్రామంలో గురువారం వేరుశెనగ , రాగి , వరి పంటల యాజమాన్య పద్ధతులపై అన్నమయ్యజిల్లా ఏడిఏఎం వి.శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి శ్రీమోహన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలను తక్కువ నీటితో, తక్కువ చీడపీడలతో , తక్కువ కాలంలో, తక్కువ ఖర్చుతో ఎలా సాగు చేసుకోవచ్చో వివరించారు. కిసాన్ డ్రోన్ వాడకంతో సస్యరక్షణకు కూలీల కొరత సమస్యలు అధిగమించి సకాలంలో పురుగు, తెగుళ్ల మందులను వాడుకొని పంటలను కాపాడుకోవచ్చునన్నారు. రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి కిసాన్ డ్రోన్ యంత్రం సేవా కేంద్రాన్ని ఏర్పరచుకొని రాయితీపై డ్రోన్ పరికరాన్ని పొంది అద్దెకు ఇచ్చి మంచి ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది రేవతి పాల్గొన్నారు.

నాలుగేళ్లలోనే దశాబ్దాల అభివృద్ధి

– పల్లెబాటలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజవర్గంలో స్వాతంత్ర్యం వచ్చాక 72 ఏళ్లలో జరగని అభివృద్ధి, సమస్యల పరిష్కారం నాలుగేళ్లలో చేసి చూపించామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి అన్నారు. గురువారం బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెలో జరిగిన పల్లెబాటలో భాగంగా రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.26.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్తులను పలకరిస్తూ..సమస్యలు తెలుసుకొంటూ పరిష్కారానికి హామీ ఇచ్చారు. తక్షణ సమస్యల పరిష్కారానికి అక్కడిక్కడే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చేతల్లో చూపించామన్నారు. నియోజకవర్గంలో రూ.600 కోట్లతో తారురోడ్డులేని పల్లె లేకుండా చేశామన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేశామన్నారు. కొత్తగా మూడు పీహెచ్‌సీల మంజూరు, బి.కొత్తకోట సీహెచ్‌సీ 50 పడకలస్థాయికి పెంపు, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, మల్లయ్యకొండ అభివృద్ధి, ఆలయాల జీర్ణోద్ధరణ పనులు జరిగాయన్నారు. త్వరలో రూ.400 కోట్ల వ్యయంతో ఇంటింటికి తాగునీటి కొళాయి ఏర్పాటు పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అయ్యాయని, పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.ప్రదీప్‌రెడ్డి, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, వైస్ ఎంపీపీలు ఖాదర్‌వలీ, రాధ, సర్పంచులు అదెప్ప, భీమగాని నాగిరెడ్డి, ఉమామహేశ్వరీ, లక్ష్మీదేవి, సాంబశివ, రామక్క, గిరిజ ర ఘునాధరెడ్డి, వెంకటరమణ, జయరామిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సుబ్బరామప్ప, మాజీ వైస్ఎంపీపీ అరుణ్‌కుమార్‌రెడ్డి, నాసీర్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


బడికాయలపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెబాట

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ములకలచెరువు: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించడానికే పల్లెబాట కార్యక్ర మం చేపట్టినట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వేపూరికోటలో జరిగిన పల్లెబాటలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వేపూరికోట నుంచి పెద్దయ్యగారిపల్లె వరకు రూ.1.21 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు శిలాఫలక ఆవిష్కరణ, వేపూరికోట ఎస్సీ కాలనీలో రూ.8 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ప్రజా సమస్యలు వింటూ ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదే శించారు. ఎంపీపీ సాయిలీలా, సర్పంచు సునీత, మల్లికార్జునరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామిరెడ్డి, జయరాంరెడ్డి, దేవ, సులేమాన్ పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలు

పెద్దమండ్యం : పేదల అభివృద్ధి కోసమే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని నత్తిఓబన్నగారిపల్లె, వడ్డిపల్లె, ఎన్ఓపల్లె తాండా, కనకంటివారిపల్లె, కలిచెర్ల పాతూరు, మిట్టావాండ్లపల్లె, గౌనివారిపల్లె, పాలన్నగారిపల్లెల్లో గురువారం అధికారులతో కలిసి పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి పల్లెకు తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, తహశీల్దార్ రాము, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు బుక్కే పద్మావతి, సోదనపల్లె బాషా, జింకా విశ్వనాథ, ఎంపీటీసీ మంచూరి జయరాం, పార్టీ మండల కన్వీనర్ చాంద్‌బాషా, మండల ఆర్‌బికేల సంఘం అధ్యక్షులు చాను, మాజీ సర్పంచ్‌లు నజీర్‌అహ్మద్, విజయ కుమార్ పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలన దేశానికే ఆదర్శం

పెద్దతిప్పసముద్రం: ఏపీ సీఎం జగనన్న పాలన దేశానికే ఆదర్శమని ప్రజా ప్రతినిధులు,నాయకులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ అన్నారు. గురువారం అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులు తుమ్మరకుంట పంచాయతీలో పర్యటించారు. ప్రజా ప్రతినిధులు శివాల లోకేష్,రవి కుమార్, శ్రీనివాసులు, సీ.రవి, రమణ, మునిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, గిరిస్వామి, రియాసత్ అలీఖాన్, చెట్ల వెంకట్,సందీప్, రామక్రిష్ణ, పట్టిరిక శంకర, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

పల్లె బాటలో సమస్యలు పరిష్కారం

కురబలకోట: గ్రామాల్లోని సమస్యలు వింటూ వాటి పరిష్కరిస్తున్నట్లు జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో గురువారం మట్లివారిపల్లె గ్రామంలో పల్లె బాట నిర్వహించారు. తరిగొండ నుండి రాయచోటి రోడ్డు వరకు రూ. 2.40 కోట్లతో చేపట్టిన తారు రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నాయకులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్వీ రమణారెడ్డి, సోమిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం : వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వాల్మీకిపురం, కలికిరి, గుర్రంకొండ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక సీడీపీఓ భారతి అన్నారు. వాల్మీకిపురం మండలంలోని చారావాండ్లపల్లిలో మెయిన్ అంగన్‌వాడీ వర్కర్, టి.సాకిరేవుపల్లిలో అంగన్‌వాడీ హెల్పర్, వాల్మీకిపురం పట్టణం 1లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే కలికిరి మండలంలో కలికిరి ఇందిరమ్మ కాలనీలో మెయిన్ అంగన్‌వాడీ వర్కర్, రెడ్డివారిపల్లిలో మెయిన్ అంగన్‌వాడీ వర్కర్, యర్రదొడ్డిపల్లిలో మెయిన్ అంగన్‌వాడీ వర్కర్, తుమ్మపేట వడ్డిపల్లి (కొమ్మేపల్లి)లో మెయిన్ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్, టి.సంద్రావారిపల్లిలో అంగన్‌వాడీ హెల్పర్, గుర్రంకొండ మండలం ఎల్లుట్లలో అంగన్‌వాడీ హెల్పర్, అరిగలవారిపల్లిలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 31వ తేదిలోపూ వాల్మీకిపురం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కేవీపల్లె : పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో విజయవాడ వైనాట్ ఓపీఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కోరారు. గురువారం కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు భాస్కర్‌రెడ్డి, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయండి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, మాజీ సర్పంచ్ హుమయూన్, వైస్ ఎంపీపీ చలపతి పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

తంబళ్లపల్లె: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం10:30గంటలకు ఎంపీపీ అనసూయమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు. అధికారులు అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తిసమాచార నివేదికలతో హాజరుకావాలన్నారు.